క్లుప్తంగా

చదువుకుంటేనే భవిష్యత్



అమరచింత: బడిఈడు పిల్లలు బడిలో ఉంటూ చదువుకోవాలని సీఆర్పీ స్వామి అన్నారు. బడి మానిన విద్యార్థులను గుర్తిస్తూ వారిని బడిలో చేర్పించేందుకు శనివారం మండలంలోని కొంకన్‌వానిపల్లిలో ఇంటింటి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన రంజిత్ కుమార్ అనే విద్యార్థి కొన్ని నెలలుగా బడిమాని వ్యవసాయ కూలీ పనులకు వెళ్తున్నాడన్న సమాచారంతో తల్లిదండ్రులను కలిసి రంజిత్‌ను బడికి పంపాలని కోరారు. చదువుకుంటేనే భవిష్యత్తు ఉందన్న విషయాన్ని విద్యార్థి కుటుంబ సభ్యులకు వివరించినట్లు సీఆర్పీ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి



మదనాపురం: తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శిగా మదనాపురం మండల కేంద్రానికి చెందిన పద్మశాలి నాయకుడు కోడం సుధాకర్‌ను శనివారం నియమించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. పద్మశాలి జాతి చైతన్యం కోసం, చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని వెల్లడించారు. గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు సుధాకర్‌ను అభినందించారు.

హామీలు అమలు చేయాలి



పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు సమగ్ర శిక్షణ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని కోరుతూ ఉద్యోగుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఎంఈఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని, వీలు కాకుంటే పేస్కేల్ అమలు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి తన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీని 15 రోజుల్లో అమలు చేయకుంటే సమ్మెకు వెళ్తామని వారు హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మదనాపురం: మండలంలోని తిర్మలాయపల్లి గ్రామ సమీపంలో శనివారం పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను కేజీబీవీ స్కూల్ వద్ద పట్టుకున్నారు. అనుమతి పత్రాలు చూపకపోవడంతో యాజమాని గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

బస్సులన్నీ రైతు పండుగకే..

డిపోలోని 80 బస్సులు కేటాయింపు

- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- హైదరాబాద్, కర్నూలు మినహా మిగతా రూట్లకు రద్దు



బస్సులు లేక వెలవెలబోతున్న బస్టాండ్

వనపర్తి: మమబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో నిర్వహించిన రైతు పండగ కార్యక్రమానికి వనపర్తి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సుల్లో ఎనభై శాతం కేటాయించటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోజూ బస్సుల్లో విధులకు వెళ్లే ఉద్యోగస్తులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సైతం అవస్థలు పడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించగా.. మరికొందరు తిరుగు ప్రయాణంలో అవస్థలు ఎక్కువ అవుతాయని సెలవు పెట్టుకున్నారు. హైదరాబాద్, కర్నూల్ ప్రాంతాలకు మినహా అన్ని ప్రాంతాలకు వెళ్లే బస్సులను రద్దు చేసినట్లు అధికారులు బస్టాండ్‌లోని కంట్రోలర్ గది వద్ద కాగితంపై రాసి అతికించారు. కనీసం పత్రికా ప్రకటన ఇవ్వకపోవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ఉదయం ఏడు గంటల నుంచే బస్టాండ్‌లో కనీసం ఒక్క బస్సు కూడా కనిపించకపోవంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

డీలక్స్‌లు మాత్రమే..

హైదరాబాద్‌కు డీలక్స్ బస్సులు మాత్రమే నడిపించారని, దీంతో మహిళలకు ఫ్రీ రవాణా సౌకర్యం కోల్పోయారని ప్రయాణికులు వాపోయారు. అర గంటకు ఒక బస్సు నడిచే ప్రాంతాలకు పూర్తిగా బస్సులను రద్దు చేయటం ఏమిటని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులు ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బస్సులను నిర్దేశిత డబ్బులు చెల్లిస్తే వారికి బస్సులను కేటాయించినట్లు సమాధానం చెప్పారని ప్రయాణికులు వాపోయారు.



నోటీస్ బోర్డులో బస్సులు రద్దు చేస్తున్నట్లు ప్రదర్శించిన లేఖ

104 బస్సులకు గాను..

డిపోలో మొత్తం 104 బస్సులు ఉండగా 80 పైచిలుకు బస్సులను సీఎం కార్యక్రమానికి అద్దెకు తీసుకున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన అన్ని రూట్ల బస్సులను రద్దు చేశాం. ఈ విషయాన్ని ప్రయాణికుల కోసం కంట్రోలర్ గది వద్ద కాగితంపై రాసి ఉంచాం.

– వేణుగోపాల్, ఆర్టీసీ డీఎం, వనపర్తి

ఉద్యోగ అభ్యర్థులకు నిరాశే

ఫార్మసిస్ట్ ఉద్యోగ అర్హత పరీక్ష శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తుండగా వనపర్తి అభ్యర్థులు మాలిక్‌తో పాటు మరికొందరు అక్కడికి వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చారు. ఈ క్రమంలో బస్సులు రద్దు కావడంతో వారు ముప్పుతిప్పలు పడి మహబూబ్‌నగర్‌కు చేరుకున్నారు. కానీ పరీక్ష కేంద్రానికి సరైన సమయంలో చేరుకోని కారణంగా అధికారులు వారిని సెంటర్‌లోకి అనుమతించలేదు. నెలల తరబడి కష్టపడి చదివినా.. పరీక్ష రాయకపోవడంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యలు పరిష్కరించాలి



వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు

ఆత్మకూర్: ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వైద్యులు, సిబ్బందిని నియమించి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని పీవైఎల్, టీయూసీఐ, పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. శనివారం స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను నాయకులు సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరాతీశారు. అవసరమైన వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులకు అరకొర వైద్యం అందుతుందని, వైద్య పరికరాలు, బెడ్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఇక్కడ 100 పడకల ఆస్పత్రి భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. సాధారణ, సిజేరియన్ ప్రసవాలను గైనకాలజిస్టు నేతృత్వంలో ఇక్కడే నిర్వహించాలని, స్త్రీవ్యాధి నిపుణులను, చిన్నపిల్లల డాక్టర్‌ను నియమించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నకుమారికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, ఆంజనేయులు, రమేష్, మురళి, ఖాజన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జ్యోతి

మదనాపురం: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంటాలని, టీచర్లు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి సూచించారు. శనివారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు రకాల సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం ద్వారా చిన్నారులకు వచ్చిన వంట సామగ్రి, వంట చేసే విధానంలో నాణ్యత పాటించాలని సూచించారు. కేంద్రం పరిసర ప్రాంతంలో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. పౌష్టికాహారం ప్రతి ఒక్కరికీ అందాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారదమ్మ, కవితమ్మ, తారమ్మ, అరుణ, సువర్ణ, హంసమ్మ, సుజాత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తకోట రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 2024 గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీమద్ భగవద్గీత కంఠస్థ పోటీలను శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా కొత్తకోటకు చెందిన కేపీఎస్ స్కూల్ విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో సి.శ్రీనిధి ద్వితీయ, ఎం.సహస్ర తృతీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు నగదు ఇచ్చారు.

డీహెచ్‌పీఎస్ సభల వాల్‌పోస్టర్ విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అమరచింత: హైదరాబాద్‌లో జనవరి 5, 6, 7 తేదీల్లో నిర్వహించే డీహెచ్‌పీఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాసప్ప, రవీందర్ కోరారు. డీహెచ్‌పీఎస్ రెండో జాతీయ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను శనివారం సీపీఐ జెండా కట్ట వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ ఉత్పత్తులు ఎక్కువగా గ్రామీణ వ్యవసాయ కూలీలుగా పని చేసే దళితులపైనే ఆధారపడి ఉంటుందని, అలాంటి దళితుల కోసం ప్రభుత్వాలు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయట్లేదన్నారు. దళితులకు సామాజిక న్యాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, భాస్కర్, రాజేష్, రాంచెంద్రి, వినోద్, సామేల్ పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదలకు సంక్షేమం



ఈటల సమక్షంలో బీజేపీలో చేరిన ఉందేకోటి

వనపర్తిటౌన్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో వనపర్తిలో కీలకంగా వ్యవహరించిన బీఆర్ఎస్ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉందేకోటి ఆంజనేయులు బీజేపీలో చేరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఉందేకోటి ఆంజనేయులు మాట్లాడుతూ వనపర్తి బీఆర్ఎస్‌లో ఆత్మగౌరవం చంపుకొని పని చేయలేక, ప్రధాని మోడీ సిద్ధాంతాలు నచ్చి బీజేపీలో చేరినట్లు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి మున్ముముందు బీజేపీలోకి చేరికలు భారీగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మాధవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశం గర్వించే స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు బూట్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ నిర్వాహకులు

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు వసతులు సద్వినియోగం చేసుకొని దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ఎంఈఓ బాలరాజు, హెచ్ఎం వీరన్న సూచించారు. హైదరాబాద్ ఉప్పల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మోట్లంపల్లిలో 117 మంది విద్యార్థులకు షూ, సాక్స్, ఇతర సామగ్రిని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రైవేట్‌కు దీటుగా రాణించే విధంగా ప్రోత్సహించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని సంస్థ అధ్యక్షుడు రాజేష్ అన్నారు. ఇక్కడి విద్యార్థులందరూ ఉన్నత విద్యను అభ్యసించేందుకు తోడ్పాటుగా నిలుస్తామని, బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ నిర్వాహకులను మోట్లంపల్లి గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో రాము, మహేష్ జీ, ఉపాధ్యాయులు విజయ్, శాంతన్న, రాఘవేందర్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీ సేవా కేంద్రం కోసం దరఖాస్తుల ఆహ్వానం

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో నూతనంగా మీ సేవా కేంద్రం కోసం ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు సూచించారు. దరఖాస్తుదారులు స్థానికులై ఉండాలని, డిగ్రీ లేదా సమాన విద్యార్హతలు ఉండాలని, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి, కంప్యూటర్, ఇంటర్నెట్ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు దారులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 7 వ తేదీలోపు దరఖాస్తు పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. కలెక్టర్ అండ్ చైర్మన్ ఈ–గవర్నెన్స్ సొసైటీ నాగర్‌కర్నూల్ పేరిట రూ.500 డీడీతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రద్దీగా ఆదిశిలా క్షేత్రం



మల్దకల్ : ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు రవిచారి, నాగరాజుశర్మ, చంద్రశేఖర్ రావు, వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.

సోళీపురంలో కార్తీక పూజలు



ఖిల్లాఘనపురం: కార్తీకమాసం చివరి శనివారం కావడంతో మండలంలోని సోళీపురంలో శ్రీలక్ష్మీనర్సింహాయోగానంద స్వామి ఆలయంలో శనివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడే సహపంక్తి భోజనం చేశారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకు పూజలు చేయడం వలన మంచి జరుగుతుందని మహావిష్ణువు కొలువుదీరి ఉంటాడని మహిళలు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: నలుగురికి గాయాలు

గోపాల్‌పేట: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో వాహనాలపై ఉన్న నలుగురు గాయాలపాలైన ఘటన మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చాకల్‌పల్లికి చెందిన రవీందర్ రెడ్డి పని మీద తన వర్కర్‌తో కలిసి వనపర్తికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. చాకల్‌పల్లి గ్రామానికే చెందిన శేఖర్‌రెడ్డి, శారదమ్మ గోపాల్‌పేట నుంచి చాకల్‌పల్లి గ్రామానికి బయల్దేరారు. గోపాల్‌పేట బంగారమ్మగడ్డ కాలనీ దాటిన వెంటనే రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను వనపర్తి ఆస్పత్రికి తరలించారు. రవీందర్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో వనపర్తి నుంచి మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని గోపాల్‌పేట ఎస్ఐ నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



కొత్తకోట రూరల్: రెండు కార్లు ఢీకొని ముగ్గురికి గాయాలయిన ఘటన కొత్తకోట మండలం కనిమెట్ట శివారులోని ఎన్‌హెచ్44పై ఫుడ్ పిరమిడ్ దాబా వద్ద చోటు చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన పద్మావతి, డేవిడ్ కారులో కర్నూల్ వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి బెంగుళూర్ వెళ్తున్న మరో కారులో నలుగురు ప్రయాణిస్తున్నారు. ఫుడ్ పిరమిడ్ దాబా వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో రెండు కార్లు ఢీకొన్నాయి. దీంతో కర్నూల్ వెళ్తున్న పద్మావతి, డేవిడ్ కు, మరో కారులో ఉన్న అబ్దుల్ జలీల్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కొత్తకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పద్మావతి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

పాఠశాలల బంద్ విజయవంతం



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొత్తకోట రూరల్: ఇటీవల వేరు వేరు ఘటనల్లో విద్యార్థులు మృతి చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, విద్యార్థుల ఆత్మహత్యలు నివారించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ స్కూళ్లను బంద్ చేయించారు. ఈ సందర్భంగా మొగిలి మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా? విద్యా కమిషన్ ఎక్కడుందని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి లేకుండా ఏడాది పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థపై సమీక్ష ఎందుకు నిర్వహించడం లేదన్నారు. గురుకుల, సంక్షేమ హాస్టళ్లు, జిల్లా పరిషత్ హై స్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు కలుషిత ఆహారంతో అస్వస్థకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాజేష్, మహేందర్, అంజి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ప్రభుత్వ విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా పాలకులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో రమేష్, రాకేష్, సంతోష్, వినయ్, వాజీద్, సంజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణపై నిర్లక్ష్యం..

అమరచింత: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో విద్యార్థులు అస్వస్థతకు గురైనా ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరించడం తగదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు ఇచ్చిన పాఠశాలల బంద్ విజయవంతం అయింది. కార్యక్రమంలో మహేష్, శివ,ఆది, గణేష్, నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన

పీపనగండ్ల: ప్రభుత్వ పాఠశాలలో తరచూ ఫుడ్ పాయిజన్ జరుగుతున్నా అధికారులు నివారణ చర్యలు తీసుకోవడం లేదని, అందుకు నిరసనగా ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు శనివారం తరగతులను బహిష్కరించి విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, అశోక్, కిరణ్, శివ, సైదులు, రంజిత్, బాలపీర్ పాల్గొన్నారు.

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో వరుసగా చోటు చేసుకుంటున్న ఫుడ్ పాయిజన్ ఘటనలకు నిరసనగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం విద్యాసంస్థల బందు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నేతలు రామాంజి, కుమార్, వెంకటేష్, చరణ్, శివ, కిషోర్, ఉదయ్, సాయి పాల్గొన్నారు.



పీపనగండ్లలో..



కొత్తకోట హైస్కూల్‌లో..



అమరచింత మండలం ఈర్లదిన్నెలో..

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా



అమరచింత నుంచి పాలమూర్‌కు వెళ్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు సంక్షేమ పథకాలు అందుతాయని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్ అన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం ప్రమాణస్వీకారం చేసిన కొద్ది రోజుల్లోనే రైతులకు రుణమాఫీ చేసి, వారిని రుణ విముక్తులను చేశారన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ మండలంలోని అమిస్తాపూర్‌లో నిర్వహించిన రైతు పండుగకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవ్వడంతో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీను, వెంకటేష్ నాయుడు, రవికుమార్, మధుసూదన్‌రెడ్డి, సత్యశీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్ నుంచి..



కొత్తకోట నుంచి..



వల్లాభాపురం నుంచి..